తాగునీటి పథకాల నిర్మాణం పూర్తిచేయండి

సంగారెడ్డి రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, నిర్మాణంలో ఉన్న తాగునీటి పథకాలను పూర్తిచేయాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆమె అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. జరాసంఘం, న్యాల్‌కల్ మండలాల్లో మిషన్ భగీరథ పనులు వెంటనే పూర్తిచేయాలన్నారు. గురుకుల, సంక్షేమ పాఠశాలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు తాగేనీటి కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించారు.



జహీరాబాద్‌లో ఘనంగా జగన్నాథ రథయాత్ర

జహీరాబాద్ పట్టణంలో ఆదివారం జగన్నాథ రథయాత్ర ఘనంగా నిర్వహించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో సాగిన ఈ యాత్ర పట్టణంలోని మాణిక్‌ప్రభు మందిరం నుంచి భవానీమందిర్ వద్ద ఉన్న వాసవీకల్యాణ మండపం వరకు కొనసాగింది. భక్తులు యాత్రలో గీతాలు ఆలపిస్తూ నృత్యం చేస్తూ శ్రీకృష్ణుడి భక్తిలో తన్మయత్వం పొందారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై రథాన్ని లాగారు.

-జహీరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి)

సంగారెడ్డిలో డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించిన నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలో 9వ వారులోని సప్తగిరి కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను శనివారం తెలంగాణ పరిశ్రమల మౌలిక సదుపాయాల చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారు. రూ. 5 లక్షల నిధులతో ఈ పనులను చేపడుతున్నారు. ఈ సందర్భంగా సప్తగిరి కాలనీ మహిళలు నిర్మలా జగ్గారెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, మార్కెట్ కమిటీ చైర్మన్ రామచందర్‌నాయక్, కూన సంతోష్, శ్రీశైలం, సతీష్ రెడ్డి, తులసీరామ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ రఘురాథోడ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.





సంగారెడ్డిలో డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డిని సన్మానిస్తున్న సప్తగిరి కాలనీ మహిళలు



నర్సాపూర్ పట్టణంలో పారిశుధ్య కార్మికుడితో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పారిశుధ్య పనులు మెరుగుపడాలి

పట్టణం పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలు సహకరించాలి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్.. తెల్లవారుజామున నర్సాపూర్‌లో పర్యటన

నర్సాపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య పనులు ఇంకా మెగరుపడాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. నర్సాపూర్ పట్టణంలో శనివారం తెల్లవారుజామునే కలెక్టర్ పర్యటించారు. పలు వార్డుల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్య పనులు ప్రస్తుతం బాగానే ఉన్నా ఇంకా మెరుగుపడాల్సి ఉన్నదని చెప్పారు. ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని, పట్టణాన్ని ఆదర్శంగా ఉంచుకోవడంలో మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఖాళీ ప్రదేశాల్లో చెత్త, వ్యర్థాలను వేయొద్దని, మున్సిపల్ వాహనాలలోనే వేయాలని అన్నారు. పట్టణంలోని కుంటల్లోకి మురుగు, వ్యర్థాలు చేరకుండా చర్యలు తీసుకునేలా చూడాలని సూచించారు.

వైన్స్‌కు రూ. 5వేలు జరిమానా

ప్లాస్టిక్ వాడుతున్నట్లు గుర్తించిన పట్టణంలోని ఓ వైన్స్‌కు రూ. 5వేలు జరిమానా విధించాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. పట్టణంలో ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి ఉన్న ముప్పును వివరించి, ప్రత్యామ్నయం వాడేలా ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్దేశించారు. ప్లాస్టిక్ వినియోగించే, విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఆయన పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు, నీటి సరఫరాను పరిశీలించారు. కలెక్టర్ వెంట కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి, మేనేజర్ మధుసూదన్, ఆర్ఐ ఫైజల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్ తదితరులు ఉన్నారు.

ఇక్కడ బ్యారేజీ.. అక్కడ ఆఫీసు

మంజీరా రిజర్వాయర్‌పై పర్యవేక్షణ కరువు

- హైదరాబాద్, పటాన్‌చెరులోనే వాటర్ బోర్డు కార్యాలయాలు
- నదిజలాలు వాడుకుంటూ పైసా ఖర్చుచేయని పరిస్థితి
- కనీసం బ్యారేజీ నిర్వహణనూ పట్టించుకోని వైనం
- ఇప్పటికే కూలిన ఆప్రాన్.. పదేళ్లుగా పనిచేయని 20 గేట్లు
- క్రస్ట్‌గేట్లలో పెరిగిన మొక్కలు.. నిరంతరం నీటి లీకేజీ
- హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ బోర్డుపై విమర్శలు



మంజీరా బ్యారేజీ క్రస్ట్ గేట్లలో పెరిగిన మొక్కలు

సంగారెడ్డి ప్రతినిధి, ఆంధ్రజ్యోతి, జూన్ 28: ఐదు దశాబ్దాలుగా హైదరాబాద్ జంట నగరాలకు తాగునీటిని అందిస్తున్న సంగారెడ్డిలోని మంజీరా బ్యారేజీపై పర్యవేక్షణ కరువైంది. మంజీరా నదిపై కల్పగూరులో నిర్మించిన ఈ రిజర్వాయర్‌ను 1969లో ప్రారంభించారు. 1.5 టీఎంసీల సామర్థ్యంతో దీనిని నిర్మించారు. ఈ బ్యారేజీకి 11 క్రస్ట్ గేట్లు, 20 చిన్న గేట్లు అమర్చారు. మరో రెండు బురద గేట్లు ఉన్నాయి. నిత్యం 40 మిలియన్ లీటర్ల నీటిని పైపులైన్ ద్వారా ఇక్కడి నుంచి సరఫరా చేస్తున్నారు. ఇందుకోసం మంజీరాలో నిరంతరం నీటి నిల్వలు ఉండేలా చర్యలు తీసుకుంటుంటారు. ఈ బ్యారేజీ దాదాపు 55 సంవత్సరాలుగా కోట్లాది మంది ప్రజల దాహార్తిని తీరుస్తున్నది. కానీ, కనీస నిర్వహణను కనీసం పట్టించుకోకపోవడంతో ఇప్పుడు డేంజర్ జోన్‌లో పడింది.

మరమ్మతులు మరిచారు

మంజీరా బ్యారేజీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించే బాధ్యతను ఒక కాంట్రాక్టు ఏజన్సీకి అప్పట్లో అప్పగించారు. కానీ నిధులు కేటాయించకపోవడంతో పర్యవేక్షణ కాస్తా పట్టుతప్పింది. గడిచిన పదేళ్ల నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని సమాచారం. ఇప్పటికే ఆప్రాన్ కుప్పకూలి చిందరవందరగా కనిపిస్తోంది. దీనికి తోడు పదేళ్ల నుంచి 20 చిన్నగేట్లు పనిచేయడం లేదు. 11 క్రస్ట్ గేట్లలోనూ అనేక సమస్యలు ఉన్నాయి. గత ఏడాది నీటి విడుదల సమయంలో గేట్లు పైకి లేవకపోవడం చర్చనీయాంశంగా మారింది. క్రస్ట్ గేట్లలో మొక్కలు పెరిగి నాచు,చెత్తాచెదారం పేరుకుపోయింది. మరో గేటు నుంచి నీళ్ల లీకేజీ అవుతున్నాయి. పిల్లర్లలోనూ సమస్యలు ఉన్నట్లు ఇటీవల పర్యటించిన ప్రాజెక్టు భద్రతా నిపుణులు గుర్తించి హెచ్చరించారు. ప్రాజెక్టుకు చేయాల్సిన భారీ మరమ్మతుల సంగతి పక్కనబెడితే కనీస రిపేర్లను చేయించడంలో అలసత్వం వహిస్తున్నారు.

ఆఫీసే లేదిక్కడ!

నిత్యం 40వేల మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేసే మంజీర బ్యారేజీ వద్ద ఎలాంటి కార్యాలయాన్ని నిర్వహించడం లేదు. ఒక ఏఈ స్థాయి అధికారిని పర్యవేక్షణ కోసం కేటాయించినప్పటికీ ఇలాంటి లోటుపాట్లను గుర్తించలేకపోయారు. సంగారెడ్డిలో ఉన్న ఈ బ్యారేజీని మానిటరింగ్ చేయడానికి హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు ఉన్నా దీని ప్రధాన కార్యాలయం ఖైరతాబాద్‌లో ఉంది. డివిజన్ ఆఫీసు పటాన్‌చెరులో నిర్వహిస్తున్నారు. అధికారులు, సిబ్బంది ఈ కార్యాలయాలకే పరిమితమయ్యారు. మంజీర నీటిని తాగునీటి అవసరాలతోపాటు ఎడాపెడా దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు సైతం వచ్చాయి. జంటనగరాల్లో ప్రజల నుంచి నీటి పన్ను పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నారు. కానీ నీటిని సరఫరా చేస్తున్న మంజీర బ్యారేజీ నిర్వహణకు మాత్రం ఖర్చు చేయడం లేదు. ఇటీవల కాలంలో వాటర్ బోర్డు ఉన్నతాధికారులు కూడా మంజీరను తనిఖీ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. తాజాగా నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా సందర్శించి మరమ్మతుల గురించి ప్రస్తావించారు. ఇప్పటికైనా మంజీర రిజర్వాయర్ బాధ్యతను పర్యవేక్షించేందుకు ప్రత్యేకాధికారులను నియమించాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా సంగారెడ్డిలో డీఈ స్థాయి అధికారితో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మంజీరా బ్యారేజీకి ముప్పులేదు
వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి 7

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ప్రమాదాల నివారణపై 'ఆపదమిత్ర' వలంటీర్లకు శిక్షణ

మల్టీజోన్ రీజినల్ ఫైర్ ఆఫీసర్ సుధాకర్‌రావు



సుధాకర్‌రావు

రామాయంపేట, జూన్ 73 (ఆంధ్రజ్యోతి): విధుల్లో అప్రమత్తంగా ఉండాలని మల్టీజోన్ రీజినల్ ఫైర్‌ఆఫీసర్ సుధాకర్‌రావు ఫైర్ సిబ్బందికి సూచించారు. రామాయంపేట ఫైర్ అవుట్‌పోస్టును శనివారం ఆయన సందర్శించారు. జెండాను ఎగురవేసి, సిబ్బంది మార్చింగ్‌ను, సిబ్బంది సన్నద్ధతను పరిశీలించారు. అనంతరం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పలు విషయాలను వివరించారు.

ఫేస్ టూ ఫేస్

మల్టీజోన్ పరిధిలో ఎన్ని ఫైర్‌స్టేషన్లు ఉన్నాయి? ఎంతమంది పనిచేస్తున్నారు?

మల్టీజోన్ పరిధిలో 19 జిల్లాల్లో 70 ఫైర్‌స్టేషన్లు ఉన్నాయి. ఇందులో 1,120 సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

కొత్తగా అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయా?

మెదక్ జిల్లా తూప్రాన్, మేడ్చల్ జిల్లా కేంద్రాల్లో ఫైర్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం.

ఈ ఏడాది ఫైర్‌మేన్‌ల నియామకాలు జరిగాయా?

ఈఏడాది కొత్తగా 610 ఫైర్‌మెన్, 225 డ్రైవర్, ఆపరేటర్లను విధుల్లోకి తీసుకున్నాం. అవసరమైనచోట కేటాయించాం.

ఫైర్ అవుట్‌పోస్టులను ఎందుకు రెగ్యులర్ చేయడం లేదు? వాటిని ఎత్తివేస్తారనే ప్రచారం నిజమేనా?

తెలంగాణలో తొమ్మిదిచోట్ల ఫైర్ అవుట్‌పోస్టులు పనిచేస్తున్నాయి. వాటిలో ఔట్‌సోర్సింగ్ విధానంలో ఫైర్‌హోంగార్డులను నియమించాం. అవుట్‌పోస్టులను ఎత్తివేసే లేదా సిబ్బందిని తొలగించే ప్రతాపాదన ఏదీ లేదు.

అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు జరిగే నష్టాలను నివారించడానికి ఎలాంటి ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు?

అగ్నిప్రమాదలు సంభవించినప్పుడు ఎలా స్పందించాలో ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా నష్టాన్ని నివారించడానికి చర్యలు తీసుకుంటున్నాం. విపత్తు సమయాల్లో ఫైర్ సిబ్బంది చేరుకునేసరికి ఆస్తి, ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంటుంది. అందుకే అన్ని గ్రామాల్లో ప్రజల్లో నుంచి 'ఆపద మిత్ర' వలంటీర్లను ఎంపికచేసి అత్యవసర శిక్షణ ఇస్తున్నాం. వారికి అవసరమైన పరికరాలు సమకూరుస్తున్నాం. అలాగే, సిబ్బందికి వారంలో నాలుగు రోజులు మాక్‌డ్రిల్ శిక్షణ ఉంటుంది.

కబ్జా చెరలో నల్లచెరువు

- 80 ఎకరాల్లో విస్తరించిన చెరువు
- రూ. 20 కోట్లు విలువైన పదెకరాలు అన్యాక్రాంతం
- వెంచర్, ఆర్వోప్లాంట్ల ఏర్పాటు



నల్ల చెరువును ఆక్రమించి నిర్మించిన వాటర్‌ప్లాంట్, రోడ్డు

సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న చెరువు ఆక్రమణకు గురవుతున్నది. రూ. 20 కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతమైంది. పది ఎకరాలు ఆక్రమించి కొందరు యథేచ్ఛగా వెంచర్ ఏర్పాటు చేయగా.. మరికొందరు ఏకంగా ఆర్వో ప్లాంట్‌ను నిర్మించి వ్యాపారమే చేస్తున్నారు.

సంగారెడ్డి రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండల పరిధిలోని కులబ్‌గూర్ గ్రామ సమీపంలో సర్వే నంబర్ 288లో 80 ఎకరాల విస్తీర్ణంలో నల్లచెరువు ఉంది. చెరువు నీటితో కులబ్‌గూర్ గ్రామంలో రైతులు పంటలను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ ప్రదేశంలో భూమి ఎకరా రూ.2కోట్లు ధర పలుకుతున్నది. దీంతో అక్రమార్కుల కన్ను చెరువుపై పడింది. చెరువు పరిధిలో 10 ఎకరాలను కొందరు ఆక్రమించారు. ఇందులో ఐదెకరాల్లో వెంచర్‌ను ఏర్పాటు చేయగా.. మరికొందరు ఏకంగా ఆర్వో ప్లాంటునే నిర్మించి నీటి దందా చేస్తున్నారు. చెరువలోకి నీరు వచ్చే మార్గాన్ని అడ్డుకోవడంతో వాన నీరు రాక చెరువు నిండటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుపైనే ఆధారపడి 80 మంది రైతులు పంటలు

మిగతా 8వ పేజీలో





ఆక్రమణకు గురైన నల్లచెరువు, దారి కోసం నీటి కాల్వలో వేసిన పైపు

నల్లచెరువు నీటితోనే పంటల సాగు



చెరువులో కొన్ని సంవత్సరాలుగా నీళ్లు సరిగ్గా రావడం లేదు. మహబూబ్‌సాగర్ చెరువు నుంచి నల్ల చెరువులోకి కాలువ ద్వారా నీళ్లు వస్తాయి. వచ్చే నీళ్లు రాకుండా కొందరు ఆపివేశారు. దీంతో చేసేది లేక వర్షాలతోనే పంటలు సాగు చేసుకుంటున్నాం.

-రామకృష్ణారెడ్డి, కులబ్‌గూర్

నీటి కాల్వకు అడ్డంకులు



చెరువును ఆక్రమించి వర్షపునీరు రాకుండా వరద కాల్వను మూసేస్తున్నారు. చెరువు నిండకపోవడంతో ఆయకట్టులో సాగుచేసిన పంటలు అర్ధాంతరంగా ఎండిపోతున్నాయి.

-నాగయ్య, కులబ్‌గూర్

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఆర్వోప్లాంటు ఏర్పాటుపై గతంలో ఫిర్యాదు రావడంతో సీజ్ చేశాం. తిరిగి తెరిచి పనులు చేస్తున్న విషయం మాదృష్టికి రాలేదు. చెరువు ఆక్రమించినట్లు వస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులకు సమాచారమిచ్చి వారి ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటాం.

-సౌజన్య, ఇరిగిగేషన్ ఏఈ, సంగారెడ్డి

పండ్ల గంప వదిలి.. పాటకు కదిలి..

పల్లె పాటల పూదోట గొట్టే కనకవ్వ

- ఆరుపదుల వయస్సులో సింగర్‌గా రాణింపు
- సినిమాల్లోనూ నటిగా అవకాశాలు
- పుట్టి పెరిగింది సిద్దిపేట జిల్లా బొడిగెపల్లిలోనే..
- బతుకుదెరువు కోసం పెద్దపల్లి జిల్లాకు మకాం

7





కల్యాణం.. కష్టాలమయం!

●నిరుపయోగంగా టీటీడీ 'మండపం' ● రూ.లక్షలు వెచ్చించి నిర్మాణం ● పట్టించుకునే వారు కరువు



నిరుపయోగంగా మారిన టీటీడీ కల్యాణ మండపం

నారాయణఖేడ్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి వారి ప్రయోజనం కోసం తిరుమల, తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన కల్యాణ మండపం నిర్వాహణ లేక నిరుపయోగంగా మారింది. దశాబ్దాల క్రితం ఇంటి ముందు వివాహం జరిపిస్తే శుభకరమని భావించేవారు. మారుతున్న పరిస్థితుల్లో ఇళ్ల ముందు వివాహాలు జరిపించడం కష్టతరంగా మారడంతో కల్యాణ మండపాలు, కమ్యూనిటీ హాళ్లలో వివాహాది శుభకార్యాలు జరిపించడం ఆనవాయితీగా మారింది. ప్రజల అవసరాలను గుర్తించిన టీటీడీ వారు నాలుగు దశాబ్దాల క్రితం ప్రధాన పట్టణాల్లో కల్యాణ మండపాలను నిర్మిస్తున్నారు.. ఇందులో భాగంగా 1994లో నారాయణఖేడ్‌లో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే కిష్టారెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్‌గా ఉన్న సమయంలో నిధులను మంజూరు చేయించారు. దీంతో నిర్మాణం పనులు పూర్తి కావడంతో 2002లో అప్పటి రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి కరణం రాంచందర్‌రావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించారు. అనంతరం తక్కువ ఖర్చుతో కల్యాణ మండపం అందుబాటులోకి రావడంతో నారాయణఖేడ్ పట్టణ వాసులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల వారు కూడా ఖేడ్ కల్యాణ మండపంలో వివాహాది శుభకార్యాలు జరిపించే వారు. అప్పట్లో నిర్మించిన కల్యాణ మండపం స్థల భావంతో ఇబ్బందులు ఎదురవుతుండంతో, తిరిగి కిష్టారెడ్డి పైభాగంలో మ్యారేజ్ హాల్ నిర్మింప చేయడానికి రూ.40 లక్షలు మంజూరు చేయించడంతో, 15 సంవత్సరాల క్రితం ఆ పనులు కూడా పూర్తి అయ్యాయి. ఇంకా కింది భాగంలో వసతుల కల్పనకు నిధుల సమస్య, ప్రహరీ నిర్మాణం లేక పోవడంతో పై అంతస్తు పనులు పూర్తి అయిన కల్యాణ మండపాన్ని వినియోగించలేని పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో పట్టణంలో ప్రైవేట్ ఫంక్షన్ హాళ్ల ఏర్పాటు కావడంతో జనాలు గత్యంతరం లేక అధిక డబ్బులకు వాటిని వివాహాది శుభకార్యాలకు వినియోగిస్తున్నారు. లక్షలు వెచ్చించి పట్టణం నడి బొడ్డున నిర్మించిన కల్యాణ మండపం నిర్వాహణ గురించి పట్టించుకోక పోవడంతో మండపంలో వివాహాది శుభకార్యాలు జరుపుకోలేని పరిస్థితి ఉంది. గత సంవత్సరం కల్యాణ మండపం నిర్వాహణ కోసం టీటీడీ అధికారులు టెండర్లను పిలిచినప్పటికీ, ఏడాది దాటినా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయక పోవడంతో, కల్యాణ మండపాన్ని ఎవ్వరూ వినియోగించలేని స్థితిలో ఉంది. కల్యాణ మండపం నిర్వాహణ చర్యలు చేపట్టడానికి తోడు టాయిలెట్స్, నీటి వసతి, కల్పించి ప్రహరీ నిర్మిస్తే పేద, మధ్యతరగతి వారికి ఉపయోగపడుతుందని, పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా టీటీడీ అధికారులు అందరికి ఉపయోగపడే విధంగా ఉన్న నారాయణఖేడ్ కల్యాణ మండపం నిర్వాహణ చేపట్టి, అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తీసుకురావాలి



పేద, మధ్యతరగతి వారి సౌలభ్యం కోసం టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణ మండపాన్ని నిర్మించినప్పటికీ, నిర్వాహణ చర్యలు లేక నిరుపయోగంగా మారిందని జూకల్ గ్రామానికి చెందిన శంకరప్ప అన్నారు. టీటీడీ కల్యాణ మండపం వినియోగంలోకి వస్తే పేద, మధ్యతరగతి వారు తక్కువ ఖర్చుతో వివాహాది శుభకార్యాలు జరుపుకోగలుగుతారు.

\- శంకరప్ప

కోడూరు టు కొండారెడ్డిపల్లి

● రూ.4.69 కోట్లతో రోడ్డు పునరుద్ధరణ

● 7 కిలో మీటర్లు బీటీగా మార్పు



మిషన్ సహాయంతో చేపడుతున్న బీటీ రోడ్డు పనులు

పుల్‌కల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు నుంచి అందోలు మండలం కొండారెడ్డిపల్లి చౌరస్తా వరకు గల రహదారి దశ మారబోతోంది. ఈ రహదారి పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కోడూరు నుంచి గిరిజన తండా మీదుగా బొమ్మారెడ్డిగూడెం, లక్ష్మీసాగర్, కొండారెడ్డిపల్లి చౌరస్తా వరకు 7 కిలో మీటర్ల రహదారి పూర్తిగా ధ్వంసమయింది. దీంతో నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణానికి వెళ్లాలంటే ఈ ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ నేపథ్యంలో కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్స్ (సీఆర్‌ఆర్) కింద రూ.4.69 కోట్లు ప్రత్యేక నిధులు మంజూరు చేయగా, గత ఏడాది నవంబర్‌లో పనులను ప్రారంభించారు. ప్రస్తుతం మూడు కిలో మీటర్ల దూరం వరకు బీటీ రహదారి పనులను పూర్తి చేశారు. కోడూరు నుంచి అందోలు మండలం కొండారెడ్డిపల్లి చౌరస్తా వరకు 7 కిలో మీటర్లు బీటీ రహదారి పనులు పూర్తి చేయనున్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు నియోజకవర్గ కేంద్రమైన జోగిపేటకు వెళ్లేందుకు ప్రయాణం ఇక సులభతరం కానున్నది.

7 కిలో మీటర్లు పూర్తి చేస్తాం

సంగారెడ్డి-సింగూరు ప్రధాన రహదారికి అనుకుని కోడూరు గిరిజన తండా, బొమ్మారెడ్డిగూడెం, హన్మానాయక్ తండా, లక్ష్మీసాగర్ గ్రామాల మీదుగా కొండారెడ్డిపల్లి చౌరస్తా వరకు 7 కిలో మీటర్లు బీటీ రోడ్డుగా మారుస్తాం. ఇప్పటి వరకు మూడు కిలో మీటర్లు బీటీ రోడ్డుగా మార్చాం. మిగిలిన ఐదు కిలో మీటర్ల దూరం రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి.

\- పీఆర్ ఏఈఈ శశికుమార్

రైలు పట్టాలపై పడుకొని యువతి ఆత్మహత్య

తూప్రాన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలపై పడుకొని ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శనివారం మెదక్ జిల్లా తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్‌లో జరిగింది. కామారెడ్డి రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన శావర్తి స్వర్ణలత (27) మనోహరాబాద్ మండలం రామాయపల్లి వద్దగల ఇండూస్ మెడికేర్ కంపెనీలో పనిచేస్తోంది. శనివారం ఉదయం కంపెనీ విధులకు హాజరైన స్వర్లలత మధ్యాహ్నం ఇంటికి బయలుదేరింది. బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఆమె సాయంత్రం హైదరాబాద్ నుంచి జైపూర్ వెళ్తున్న స్పెషల్ రైలుకు అడ్డుగా పట్టాలపై పడుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కామారెడ్డి పోలీసులు పంచనామా అనంతరం మృతదేహాన్ని కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు. యువతి ఆత్మహత్యకు ముందు రైల్వేస్టేషన్‌లో ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం.

వంతెనను ఢీకొన్న లారీ..

●తప్పిన ప్రమాదం

సిద్దిపేట రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఓ లారీ అదుపుతప్పి వంతెనను ఢీ కొట్టింది.ఈ సంఘటన శనివారం ఉదయం నారాయణరావుపేట మండలం మల్యాల శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట నుంచి సిరిసిల్ల వైపు వెళ్తున్న లారీ ఆదిపేరుమాళ్ల దేవాలయం సమీపంలోని ఇరుకు బ్రిడ్జి వద్ద ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి కల్వర్టు సైడ్ వాల్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఏమీ కాకపోవడంతో క్షణాల్లో పెనుప్రమాదం తప్పిందని వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇరుకుగా ఉన్న బ్రిడ్జిని నూతనంగా నిర్మించాలని పలుమార్లు అధికారులకు, మంత్రులకు విన్నవించిన పట్టించుకున్న దాఖాలాలు లేవని వాహదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి



హెడ్‌కానిస్టేబుల్ పండరి(ఫైల్)

నర్సాపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మైసగోనిపండరి(53) అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పండరి 1992లో కానిస్టేబుల్‌గా నియామకమై వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేసి ప్రస్తుతం నర్సాపూర్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో హైదరాబాద్ శివారులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడు హెడ్‌కానిస్టేబుల్‌కు భార్య చంద్రకళతో పాటు ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. పండరి ఇక్కడ విధులు నిర్వహిస్తు స్థానికులతో మంచి వ్యక్తిగా పేరుతెచ్చుకున్నాడు. అనారోగ్యంతో అకాల మరణం చెందడం పట్ల స్థానిక పోలీసులతో పాటు పలువురు కూడా ఆ కుటుంబానికి ప్రగాడ సానుభూతి వ్యక్తం చేస్తు సంతాపం వ్యక్తం చేశారు.

తాళం పగలగొట్టి చోరీ

● 3 తులాల పుస్తెలతాడు, 2000 నగదు అపహరణ

టేక్మాల్ జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తాళం పగలగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీ చేశారు. ఈ సంఘటన మండల కేంద్రమైన టేక్మాల్‌లో జరిగింది. టేక్మాల్ ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మల్లని భాగ్య దంపతులు హైదరాబాద్‌లో జీవనం సాగిస్తున్నారు. భాగ్య కొన్ని రోజులుగా గ్రామంలోనే ఉంటుంది. శుక్రవారం రాత్రి ఇంటి ఆవరణలో పాముల భయంతో పక్కన ఉన్న వారి కిష్టయ్య ఇంట్లో నిద్రించేందుకు వెళ్లింది. శనివారం ఉదయం లేచి ఇంటికి వచ్చి చుడాగానే ఇంటికి ఉన్న తాళం పగలకొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని లాకర్ పగిలిపోయి ఉంది. లాకర్‌లో ఉన్న 3తులాల బంగారం, పుస్తెలతాడు, అందులో ఉన్న 2000 నగదు చోరీ చేశారు. పోలీసులు సంఘటన స్థలనికి చెరుకుని ఆధారాలను పరిశీలించారు. భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

చేపలు పట్టే విషయంలో వివాదం

●అడ్డుకున్న పోలీసులు

చేగుంట జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువు విషయంలో గ్రామంలోని ఇరు వర్గాల మధ్య మళ్లీ వివాదం నెలకొంది. మెదక్ జిల్లా నార్సింగి మండలం వల్లూరు గ్రామంలో దాదాపు సంవత్సరం నుంచి ఇరు వర్గాల మధ్య చెరువులలో చేపలు పట్టే విషయంలో గొడవ జరుగుతోంది. మత్స్యశాఖ నుంచి ముదిరాజులు సొసైటీగా ఏర్పడి చెరువులను తమ పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కోర్టు ఉత్తర్వులను తెచ్చుకుని ముదిరాజులు చెరువులో చేపలు పట్టడానికి సన్నాహాలు చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ విషయమై గతంలో రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్ మత్స్య శాఖ అధికారుల సమక్షంలో ఇరు వర్గాలను సముదాయించారు. శనివారం ఉదయం పలువురు దాదాపు ఇరవై మంది, మినీ లారీ తీసుకుని చెరువు వద్దకు చేపలు పట్టడానికి వెళ్లారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు చెరువు వద్దకు వెళ్లి వారిని అడ్డుకుని, గ్రామ సొసైటీగా ఉన్న మదిరాజులు మాత్రమే చేపలు పట్టాలని, వేరే ప్రాంతం నుంచి వచ్చిన వారు చేపలు పట్టవద్దని గ్రామస్థులు అడ్డుకున్నారు. గతంలో పంచాయతీ విషయంలో అలా చేస్తే సొసైటీ రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని పంచాయతీ పెద్దలు గ్రామస్థులుకు హామీ ఇచ్చారని చెప్పారు. దాంతో మినీ లారీని అడ్డుకున్నారని వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయాన్ని తెలుసుకున్న రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్ ఎస్సై అహ్మద్ మొహీనుద్దిన్ మత్స్య శాఖ అధికారుల సమక్షంలో ఇరు పక్షాలతో చర్చలు జరిపి సముదాయించారు.

దొంగతనాల కేసుల్లో నిందితుడి రిమాండ్

బెజ్జంకి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దొంగతనాల కేసుల్లో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తిరుపతిరెడ్డి తెలిపారు. మండలంలో ఇటీవల జరుగుతున్న దొంగతనాల విషయంలో పోలీసులు టీమ్‌లుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బెజ్జంకి క్రాసింగ్ వద్ద శనివారం అనుమానాస్పదంగా తిరుగుతున్న గుండారం గ్రామానికి చెందిన వాసంపల్లి మధుసూదన్ రెడ్డిని పోలీసులు పటుకుని విచారించారు. గుండారం గ్రామానికి చెందిన బొంతల సుజాత, బోడపట్ల ఎల్లవ్వ ఇళ్లల్లో చోరికి పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడు. రెండు ఇళ్లల్లో చోరీ చేసిన బంగారు, వెండి ఆభరణాలను మండల కేంద్రంలోని ముత్తూట్ మనీ లిమిటెడ్‌లో తాకట్టు పెట్టాడు. రెండు కేసుల్లో రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, 67 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హజరు పరచి రిమాండ్‌కు తరలించారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

హవేళిఘణపూర్, జూన్28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌట్లపల్లి గ్రామంలో శనివారం ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన చీమల చంద్రయ్య(52) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. చంద్రయ్య కొన్ని రోజుల క్రితం 20 గుంటల పొలాన్ని అప్పు చేసి కొనుగోలు చేశాడు. అప్పులు ఎలా తీరుతాయోనని ఎప్పుడూ బాధపడుతుండేవాడు. ఉదయం పొలంలోని గట్లకు గడ్డి మందు పిచికారి చేస్తానని మందు తీసుకెళ్లి గ్రామ సమీపంలో గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన గ్రామస్థులు మెదక్ ప్రభుత్వ హాస్పిటల్‌కు తరిలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. చంద్రయ్య తల్లి బాలమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.



జోగిపేటలోని ఏరియా ఆస్పత్రిలో బాలింతతో మాట్లాడుతున్న సంగారెడ్డి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

● వైద్యులకు డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి ఆదేశం

జోగిపేట, జూన్28(ఆంధ్రజ్యోతి : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన చికిత్సలు అందించాలని జిల్లా ప్రభుత్వాస్పత్రులు, సేవల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) డాక్టర్ సంగారెడ్డి వైద్యులకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో ఆయన శనివారం జోగిపేటలోని ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతీ వార్డును కలియ తిరిగారు. ఆపరేషన్ థియేటర్లు, ఎక్స్‌రే, ల్యాబ్ గదులు, ఓపీలో సేవలను పరిశీలించారు. ఫార్మసీ రికార్డులు, వైద్యులు, సిబ్బంది హాజరు రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే వారంతా నిరుపేదలేనని, ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా సేవలందించాలన్నారు. ఫిర్యాదులు వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ అశోక్, సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్య, సిబ్బంది ఉన్నారు.

అమ్మా.. సమస్యలేమైనా ఉన్నాయా?

● వృద్ధాశ్రమాన్ని సందర్శించిన జూనియర్ సివిల్ కోర్టు జడ్జి



వృద్ధ ఆశ్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న జడ్జి

నర్సాపూర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లోని వృద్ధ ఆశ్రమాన్ని శనివారం సాయంత్రం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హేమలత ఆకస్మికంగా సందర్శించారు. అక్కడున్న వృద్ధులను ఆప్యాయంగా పలుకరించారు. మీ సమస్యలు ఏమైనా ఉన్నాయా.. ఆశ్రమ నిర్వాహకులు బాగా చూసుకుంటున్నారా.. అంటూ ఆరా తీస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడున్న వృద్ధులకు పింఛన్ రావడం లేదని కొందరు జడ్జి దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత అధికారులతో మాట్లాడి వచ్చేలా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఏ సమస్య ఉన్నా స్థానిక మండల లీగల్ సర్వీసెస్ కమిటీ దృష్టికి తేవాలని సూచించారు.

పది రోజుల్లో 127 మొబైల్ ఫోన్ల రికవరీ

● బాధితులకు అప్పగించిన మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవలి కాలంలో దొంగతనానికి గురైన 127 మొబైల్ ఫోన్లను పది రోజుల్లోనే గుర్తించి శనివారం బాధితులకు అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్లు చోరీకి గురైన పౌరులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తమ ఫోన్లను ట్రాక్ చేసి తిరిగి పొందే అవకాశం ఉందన్నారు. చోరీ జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే దొంగతనమైన మొబైల్ ఫోన్‌లను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించవచ్చునన్నారు. ఇది ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రగతిశీల టెక్నాలజీపై ఆధారపడిన ఒక గొప్ప సాధనమని తెలిపారు. ప్రజలు, వినియోగదారులు సెకండ్ హ్యాండ్ సెల్‌ఫోన్లు కొనుగోలు చేస్తే.. ఆ దుకాణ యాజమాని నుంచి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రజల కోసం పోలీసు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. సమస్యలు వస్తే పోలీసు సేవలు వినియోగించుకోవాలని సూచించారు. మొబైల్‌ఫోన్లు అందుకున్న బాధితులు ఎస్పీతోపాటు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీసీఆర్బీ ఇన్స్‌క్టర్ మధు సూదన్‌గౌడ్, ఐటీకోర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సండే స్పెషల్ Sunday Special

పండ్లగంప వదిలి.. పాటకు కదిలి..



సమ్మక్క సారక్క వీరుల జాతరా.. మన మేడారంలో.. ఆదివాసుల అమరుల జాతరా.. మూలవాసుల మన్నెం జాతర.. మన మేడారంలో.. పచ్చని అడవిలో పవిత్ర జాతర, నర్సపల్లి గండిలోన గంగాధరి.. ఆడ నెమలి ఆటలకు గంగాధారి.. మగా నెమలి మోసపోయే గంగాధారి.. అంటూ సాగే ఈ రెండు పాటలు యావత్ తెలంగాణ రాష్ట్రాన్ని ఊపేసింది. ఈ పాటలతో ఫేమస్‌గా మారి.. మరెన్నో పాటలు పాడుతూ ఆరుపదుల వయస్సులో ఫోక్ సింగర్‌గా రాణిస్తున్నారు బొడిగెపల్లి బిడ్డ గొట్టే కనకవ్వ. సినిమాల్లోనూ నటిగా రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్న అచ్చమైన పల్లెటూరి జానపద పాటమ్మపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- అక్కన్నపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి)



● పల్లె పాటల పూదోట గొట్టే కనకవ్వ
● ఆరుపదుల వయస్సులో సింగర్‌గా రాణింపు
● సినిమాల్లోనూ నటిగా అవకాశాలు
● పుట్టి పెరిగింది సిద్దిపేట జిల్లా బొడిగెపల్లిలోనే..
● బతుకుదెరువు కోసం పెద్దపల్లి జిల్లాకు మకాం

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం బొడిగెపల్లి గ్రామానికి చెందిన జంగపల్లి ఓదయ్యా-రాజవ్వ దంపతులకు ఏడుగురు కుమార్తెలు, ఐదుగురు కుమారులు. 12 మంది సంతానంలో కనకవ్వ నాలుగో కుమార్తె. ఆమెకు చిన్నప్పుడే సిద్దిపేట జిల్లా దుళిమిట్ట మండలం కూటిగల్‌కు చెందిన గొట్టే బాలయ్యతో వివాహంకాగా, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. అత్తగారి ఊర్లో బతకడానికి ఇబ్బందులు ఎదురుకావడంతో తల్లిగారి ఊరైన బొడిగెపల్లికి వచ్చి కూలి పనులు చేసుకుంటూ ఉండేవారు. ఇక్కడ కూడా వర్షాలు లేక వ్యవసాయ బావుల్లో నీరు లేకపోవడంతో బతుకుదెరువు కష్టమవుతుందని హైదరాబాద్‌కి వెళ్లి ఇళ్లలో పని చేసుకుంటూ 10 ఏళ్లు అక్కడే ఉన్నారు.

పండ్ల గంపతో వాడవాడ తిరుగుతూ..

కనకవ్వ తమ్ముడు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఉండడంతో హైదరాబాద్ నుంచి వారి కుటుంబం అక్కడికి మకాం మార్చారు. గోదావరిఖనిలోని ఇందిరానగర్‌లో నివాసముంటూ భర్త మున్సిపల్ కార్మికుడిగా పనిచేస్తుంటే, కనకవ్వ ఏ సీజన్‌లో ఏ పండ్లు వస్తే ఆ పండ్ల గంప ఎత్తుకొని వాడ వాడ తిరిగి విక్రయిస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేది. చిన్నప్పటి నుంచే తన తల్లి రాజవ్వ పాటలు పాడుతుండడంతో తల్లితో పాటే కూలి పనులకు వెళ్లి పాటలు పాడడం అలవాటు చేసుకుంది. ఆ పాటలే ఇప్పుడు కనకవ్వ ఫోక్ సింగర్‌గా ఎదిగేందుకు దోహదపడ్డాయి.

మొదట అవకాశమిలా..

2019లో కనకవ్వ చెల్లె బిడ్డ మంగవ్వ ఓ టీవీ ఛానల్‌లో చూసి ఫోక్ స్టూడియో కార్యక్రమం కోసం సెల్‌ఫోన్‌లో రెండు నిమిషాలు పాట పాడి పంపుమని చెప్పడంతో ఆమె పాట పాడి పంపించింది. అది విన్న ఆ టీవీ ఛానల్ వాళ్లు హైదరాబాద్‌కు రమ్మనడంతో వెళ్లిన కనకవ్వ మొదటిసారి టీవీలో భయభయంగా గెన్నెరామ.. గెన్నెరామ.. గెన్నెరామ గెట్టు మీద గున్న మామిడో పిల్లడో.. పాట పాడారు. అక్కడ ఉన్న వాళ్లు తన పాట విని చప్పట్లు కొట్టి మెచ్చుకున్నారు. మిట్టపల్లి సురేందర్, వరంగల్ శీను, మురళిమధులు కనకవ్వ టాలెంట్‌ను గుర్తించారు. అప్పటినుంచి పండ్ల గంప మూలకు పడేసి ఇప్పటి వరకు 100 పాటలు పాడారు. జానపద గాయని మంగ్లీ, నృత్యకారిణి జాను, గేయ రచయిత, సింగర్ చరణ్‌అర్జున్‌తో పాటు మరికొంతమందితో కలిసి పాటల షూటింగ్‌లో పాల్గొన్నారు కనకవ్వ.

పది సినిమాల్లో నటిగా..

సలార్, దసరా, గుంటూరు కారం, మట్టి కథలు, లగ్నం, చంద్రమండలం, రాకెట్, పొట్టేలు, అంబాజీపేట బ్యాండ్ బాజాలు, జమీందార్ సినిమాల్లో నటించారు. పలక బలపం పట్టలేదు.. అక్షర ముక్క రాదని, వాళ్ల అవ్వ పాట పాడుతుంటే విని నేర్చుకున్నానని చెబుతున్నది కనకవ్వ. ఎవరైనా పాట రాసి వినిపిస్తే గుర్తుపెట్టుకుని పాటలు పాడుతున్నానని, తాను బతికున్నా నాళ్లు పాటలు పాడుతానని అంటున్నది. తన బిడ్డ కొడుకు రాకేష్ తనను షూటింగ్, రికార్డింగ్‌లకు తీసుకువెళ్తాడని తెలిపింది.

ఉండడానికి ఇల్లు లేదు : కనకవ్వ

ఉండడానికి నాకు సొంత ఇల్లు లేదు. మా కొడుకు ఇంటి వద్దే నేను నా భర్త ఉంటున్నాం. ఇల్లు చిన్నగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. చుట్టాలు వస్తే ఉండడానికి ఇబ్బందిగా ఉంటుంది. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నా.

మైదాకు పండుగ

ఆషాఢమాసం స్పెషల్.. గ్రామాల్లో మొదలైన సందడి

● ఎంత ఎర్రగా పండితే అంత మంచిదని నమ్మకం
● ఆరోగ్యానికి ఎంతో మంచిది
● ప్రకృతి సిద్ధమైన మైదాకుకు ప్రాధాన్యం



జగదేవ్‌పూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం వచ్చిందంటే చాలు, మహిళలకు మైదాకు (గోరింటాకు) సంబరం మొదలవుతుంది. డోలు వాయిద్యాలు, శివసత్తుల శిగాలు, పోతరాజుల విన్యాసాలతో పాటు, మహిళలు తమ చేతులకు, కాళ్లకు మైదాకు పెట్టుకుని మురిసిపోవడం ఈ మాసంలో సర్వసాధారణం. మైదాకు ఎంత ఎర్రగా పండితే అంత మంచిదని నమ్ముతుంటారు. ఆషాఢం ప్రారంభం కాగానే మైదాకు పెట్టుకోవడానికి మహిళలు పోటీ పడుతుంటారు. ఇప్పటికే గ్రామాల్లో ఈ సందడి మొదలైంది.

అమ్మాయిల నుంచి మగవారి వరకు...

ఆషాఢ మాసం రాగానే చాలా మంది ఆడవారు తమ చేతులకు గోరింటాకు పెట్టుకుని మురిసిపోతుంటారు. ముఖ్యంగా కొత్తగా పెళ్లైన యువతులు అత్తగారింటి నుంచి అమ్మగారింటికి వచ్చినప్పుడు, ఒకటి రెండు రోజులలో తప్పనిసరిగా మైదాకు పెట్టుకుంటారు. కేవలం మహిళలే కాకుండా, గతంలో మగవారు కూడా మైదాకును విధిగా పెట్టుకునేవారు. ఇప్పుడు కొంతవరకు తగ్గినప్పటికీ, ఆషాఢ మాసంలో వారు కూడా పెట్టుకుంటారు. మహిళలు పెట్టుకోగా మిగిలిన ఆకును చేతి మెత్తానికి రుద్దుకొని శుభ్రం చేసుకుంటారు.





మైదాకుతో ఆరోగ్య ప్రయోజనాలు

మైదాకు కేవలం అందానికే కాకుండా, ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఆషాఢంలో వర్షాలు కురిసి వాతావరణం చల్లగా మారుతుంది. ఈ సమయంలో మైదాకు పెట్టుకోవడం వల్ల శరీరంలో వేడి సమతుల్యం అవుతుందని అంటారు. వర్షాల వల్ల పెరిగే సూక్ష్మక్రిములు, అంటువ్యాధులను నివారించడంలో కూడా మైదాకు సహాయపడుతుంది. ఇందులో వేడిని తగ్గించే గుణం ఉండటమే కాకుండా, రోగ నిరోధక శక్తిని పెంచి, రక్త ప్రసరణను సక్రమంగా జరిగేలా చేస్తుంది. అందుకే ప్రతి ఆచారం వెనుక ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయని చెబుతారు.

మైదాకు ఎర్రగా పండాలంటే చిట్కాలు

గోరింటాకు మంచి రంగు రావాలంటే కొన్ని చిట్కాలు పాటిస్తారు. మైదాకు రుబ్బేటప్పుడు అందులో నిమ్మరసం, కొద్దిగా చింతపండు కలిపితే బాగా పండుతుంది. మైదాకు పెట్టుకున్న తర్వాత అది పూర్తిగా ఎండి, రాలిపోయే స్థితికి వచ్చాకే తీయాలి. తీసిన వెంటనే చేతులు శుభ్రం చేసుకోకుండా కనీసం అరగంటైనా ఆగి శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాత కొద్దిగా నూనె రాస్తే గోరింటాకు మరింత ఎర్రగా వస్తుంది.

ప్రకృతి సిద్ధానికే మొగ్గు

ప్రస్తుతం చాలా మంది ప్రకృతి సిద్ధమైన మైదాకువైపే మొగ్గు చూపుతున్నారు. ఇంటి ఆవరణలో, గ్రామ పంచాయతీలలో, వ్యవసాయ పనుల వద్ద పెరిగే మైదాకు చెట్ల ఆకులను తెంపుకొని వచ్చి వాటిని రుబ్బుకొని పెట్టుకుంటున్నారు. అయితే, అందరికీ మైదాకు అందుబాటులో లేకపోవచ్చు. అలాంటి వారు మైదాకుకు బదులుగా మెహందీని కూడా పెట్టుకుంటున్నారు. మెహందీతో వివిధ డిజైన్‌లు పెట్టుకోవచ్చని మహిళలు చెబుతారు. అయితే, మెహందీని కొనేటప్పుడు మంచి కంపెనీది, తాజాగా ఉన్నదాన్ని మాత్రమే ఎంచుకోవాలి. నాసిరకం మెహందీని వాడితే ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది.



సివిల్ కోర్టు భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయాధికారి భవానీచంద్ర

జిన్నారంలో కోర్టు భవనం పరిశీలన

జిన్నారం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం జిన్నారంలో ఏర్పాటు చేసిన సివిల్ కోర్టును జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ భవనాన్ని జిల్లా న్యాయాధికారి భవానీచంద్ర పరిశీలించారు. జిన్నారంలో కోర్టును ఏర్పాటు చేస్తుండగా ఇటీవలే రూ.8.40 లక్షలతో పలు పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, న్యాయవాదులు శ్రీధర్‌రెడ్డి, బాలకృష్ణ జఫర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ఆందోళన

టేక్మాల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : అర్హులైనవారికే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని టేక్మాల్ గ్రామపంచాయతీ ఆవరణలో లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. మండల కేంద్రమైన టేక్మాల్ గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. గ్రామంలో 41 మంది లబ్ధిదారుల పేర్లను ప్రకటించారు. అందులో కొందరు అనర్హులు ఉన్నా.. వారికే ఇళ్లను కేటాయించడం సరికాదన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు జోక్యం చేసుకుని, రెండోవిడత జాబితాలో అర్హులందరికీ ఇళ్లు మంజూరయ్యేలా చూస్తామని హామీఇచ్చారు.

క్విజ్ పోటీల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



స్టడీ మెటీరియల్, ప్రశంసా పత్రాలను చూపుతున్న విద్యార్థులు

కంది, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మ్యూచువల్ ఫండ్స్ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడానికి జాతీయస్థాయిలో నిర్వహించే క్విజ్ పోటీలో మండలంలోని ఆయుధ కర్మాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులు సృష్టి, హారిక, రిషిక అద్భుత ప్రతిభ కనబర్చారు. హైదరాబాదులో శనివారం నిర్వహించిన క్విజ్ పోటీలో ఈ ముగ్గురు పాల్గొని ప్రశంసాపత్రాలు, స్టడీ మెటీరియల్ పొందారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జయంతివాణి, గైడ్ ఉపాధ్యాయుడు అడ్డాడ శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు రజిత, రవీందర్, సంధ్య విద్యార్థులను అభినందించారు.

నర్సాపూర్‌లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

● మెదక్ జిల్లాలోనే మొట్టమొదటగా ఏర్పాటు
● స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయ భూమిని పరిశీలించిన అధికార బృందం
● త్వరలో సర్వే చేసి భూమిని ప్లాంటు కోసం లీజు ఇచ్చేందుకు నిర్ణయం

నర్సాపూర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని పెంచే ఆలోచనలో భాగంగా చేపట్టిన సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు మెదక్ జిల్లాలోనే మొట్టమొదటగా నర్సాపూర్‌లో ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు. మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారికి అనుకుని నర్సాపూర్ పట్టణంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి చెందిన వంద ఎకరాల భూమి ప్రస్తుతం పడావుగా ఉంది. ఆ భూమిని వినియోగంలోకి తేవడంతో అటు దేవదాయ శాఖకు ఆదాయం, ఇటు సోలార్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టి మహిళా సంఘాలకు ఆర్థికంగా ఉపాధి కల్పించే వీలుగా స్థలాన్ని కేటాయించాలని నిర్ణయించారు. అందులో భాగంగా గతంలోనే ఈ స్థలాన్ని అధికారులు పరిశీలించి సోలార్ ప్లాంటు ఏర్పాటుకు ఉపయోగకరంగా ఉంటుందని నిర్ణయించారు. ఈ మేరకు శనివారం డీఆర్‌డీఏ రాష్ట్ర సీఏవో కృష్ణారావు, నాబార్డు ఏజీఎం రామకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌రావు, విద్యుత్‌శాఖ ఏడీఈ రమణారెడ్డి, దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి శ్రీనివాస్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్, ఏపీఎం గౌరిశంకర్, ఏపీవో అంజిరెడ్డిలతో కూడిన బృందం స్థలం పరిశీలించారు. వెంటనే సర్వే చేసి ముందుగా ఎనిమిది ఎకరాలు ప్లాంటు కోసం కేటాయించేందుకు అనువైన చోట ఎంపిక చేసి పెట్టాలని స్థానిక సర్వేయర్‌కు సూచించారు.



నర్సాపూర్‌లో స్థల పరిశీలన చేస్తున్న అధికారుల బృందం

వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలన్నదే లక్ష్యం: సీఏవో

రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని డీఆర్‌డీఏ రాష్ట్ర సీఏవో కృష్ణారావు పేర్కొన్నారు. నర్సాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సోలార్ ప్లాంట్ల నిర్వహణ బాధ్యతలను ఆయా ప్రాంతాల మహిళ సంఘాలకే అప్పగిస్తామన్నారు. ప్రభుత్వం సబ్సిడీతో పాటు రుణ సదుపాయం కూడా కల్పిస్తుందన్నారు.

నల్లవల్లిలో..

గుమ్మడిదల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామ శివారులో త్వరలో ఇందిరా మహిళా శక్తి పవర్ ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు డీపీఎం జయశ్రీ రాజ్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర స్థాయి సెర్ప్, నాబార్డ్ ప్రతినిధుల బృందంతో కలిసి ఆయన గుమ్మడిదల మండలం నల్లవల్లిలోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నల్లవల్లి మహిళా సంఘాల సభ్యులతో కలిసి పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేయబోయే పవర్ ప్లాంట్‌కు ఎదురవుతున్న ఇబ్బందులు, కావలసిన సౌకర్యాలను గురించి చర్చించారు. అలాగే మహిళా సంఘాల సభ్యులకు తగు సూచనలు చేశారు. ప్రాజెక్ట్ స్థాపనకు త్వరలో విధి విధానాలు ఖరారు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఆయన వెంట సెర్ప్ డైరెక్టర్ కృష్ణారావు, నాబార్డ్ ఏజీఎం రామారావు, నాబార్డ్ కన్సల్టెంట్ రామకృష్ణ, డిస్టిక్ మేనేజర్ రెడికో రవీందర్ చౌహన్, ఏపీఎం శివకుమార్, సీసీ అలివేలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు, యోగేశ్వరి, వీవోఏ అరుంధతి తదితరులు ఉన్నారు.

మంజీరా బ్యారేజీకి ముప్పులేదు

● వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నగరానికి తాగునీరు అందించే మంజీరా బ్యారేజీకి ఎలాంటి ముప్పులేదని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన శనివారం జలమండలి ఉన్నతాధికారులతో కలిసి మంజీరా బ్యారేజీ, బారాజ్ గేట్లు, బారాజ్ పిల్లర్లు, పంప్‌హౌజ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరానికి మంచినీరు అందించేందుకు నిర్మించిన మంజీరా బ్యారేజీకు ఎలాంటి ప్రమాదం లేదని, బారాజ్ పిల్లర్లకు పగుళ్లు ఏర్పడ్డాయని వివిధ మాధ్యమాల్లో వచ్చిన వార్తలు అవాస్తవమని చెప్పారు. బ్యారేజీకి సంబంధించిన గేట్లు, రోప్‌ల పనితీరు కూడా బాగానే ఉందన్నారు. అయితే బారాజ్ దిగువన ఆప్రాన్ కొంతమేరకు దెబ్బతిందని, మరమ్మతు కోసం వెంటనే ఏజెన్సీతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే రెండో గేటు లీకేజీను అరికట్టేందుకు మరమ్మతు పనులను చేపట్టాలని స్వప్న ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ నిర్మాణ సంస్థకు సూచించారు. అనంతరం బ్యారేజీపై గేట్లు, రోలర్, ప్యానల్ బోర్డులు, ఎలక్ట్రో మెకానికల్ తదితర భాగా లను ఎండీ పరిశీలించారు. మంజీరా బ్యారేజీ గేట్లు, రోప్‌లు, బేరింగ్‌లను మార్పునకు గతేడాది మే నెలలో రూ.3.52 కోట్లతో ప్రతిపాదనలను, టెండర్ ప్రక్రియ పూర్తిచేసి ఏజెన్సీని నియమించినట్లు చెప్పారు.



న్యూస్ బాక్స్

కలెక్టర్‌ను కలిసిన కార్పొరేటర్



కలెక్టర్‌తో కార్పొరేటర్ సింధూ

రామచంద్రాపురం టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : భారతీనగర్ కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి శనివారం హైదరాబాద్ కలెక్టర్ హరిచందన కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు పెద్ద ఎత్తున మొక్కలు నాటనున్నామన్నారు.

30న ఖేడ్‌లో ప్రజావేదిక

నారాయణఖేడ్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో 30న ఉదయం 8.30 గంటలకు ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులపై 15వ విడత సామాజిక తనిఖీ 17న నుంచి గ్రామాల్లో ప్రారంభమైందన్నారు. తనిఖీపై తుది నివేదిక ఇవ్వడానికి ప్రజావేదికను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ప్రభుత్వ పాఠశాలలో విజ్ఞాన శాస్త్ర సదస్సు

పెద్దశంకరంపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు విజ్ఞానశాస్త్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగస్త్య ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో మానవ అవయవాలకు సంబంధించిన గుండె, కన్ను, అస్థిపంజరం, ఊపిరితిత్తులు, మెదడు మొదలైన వాటి పనితీరును విద్యార్థులకు వివరించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

పెద్దశంకరంపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పెద్దశంకరంపేట పీహెచ్‌సీ సిబ్బంది యాదయ్య పేర్కొన్నారు. శనివారం పేటలోని బాలుర సంక్షేమ వసతి గృహంలో వంట పనిచేసే వారికి, మిగతా సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

కోహీర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చింతలఘట్టు, దిగ్వాల్, మాచిరెడ్డిపల్లి, పీచేర్యాగడి, పీచేర్యాగడి తండా, కొత్తూరు(కే) ఖానాపూర్, మానియార్‌పల్లి, గ్రామాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 450 మంది ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ప్రముఖ పారిశ్రామికవేత్త కాంగ్రెస్ నాయకుడు కేప్రసాద్‌రెడ్డి శనివారం ఉచితంగా రూ.3 వేల నోటు పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఒకో విద్యార్థికి అన్ని సబ్జెక్టులు కలిపి 6 చొప్పున అందజేశారు.

రోడ్డుకు మరమ్మతులు

కోహీర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలంలోని 65వ జాతీయ రహదారి నుంచి వెంకటాపూర్ గ్రామాల వరకు 'అడుగడుగునా గుంతలే' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన మాజీ సర్పంచ్ రాజశేఖర్ తన సొంత నిధులతో శనివారం గుంతల రోడ్డుకు మరమ్మతు పనులు చేయించారు. రాబోయే రోజుల్లో కూడా గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి మరిచేందుకు కృషి చేస్తానన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి

పెద్దశంకరంపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట మండల పరిధిలోని మూసాపేట మాజీ ఎంపీటీసీ రమావత్ బాలిబాయి(95) శనివారం మృతిచెందారు. ఆమె కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కనుమూసింది. గతంలో ఆమె ఎంపీటీసీగా ఉన్నప్పుడు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి..

కౌడిపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేని వ్యక్తి మృతిచెందిన సంఘటన వెంకట్రావ్‌పేట్‌లో జరిగింది. కార్యదర్శి ఈట్యనాయక్ వివరాల ప్రకారం.. శనివారం బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం(55) పడి ఉందని స్థానికులు తెలిపారు. మృతుడు కొంతకాలంగా వెంట్రావ్‌పేట్ గేట్ సమీపంలో ఉండేవాడు. ఈ విషయమై ఎస్‌ఐ రంజిత్‌రెడ్డికి ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని నర్సాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

'నవోదయ' ఏర్పాటుకు నిరంతర కృషి

● ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి



వేదిక ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ సురేష్ షెట్కార్, పక్కన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు మిత్ర సోషల్ సొసైటీగా కృషి చేయడం అభినందనీయమని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శనివారం నారాయణఖేడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983-84లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల సౌలభ్యం కోసం నిర్మించిన వేదికను వారు ప్రారంభించి మాట్లాడారు. తాము కూడా ఈ పాఠశాలలో చదువుకున్నామన్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలో విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని, జిల్లాకు మంజూరైన నవోదయ పాఠశాలను నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేయించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ఏడేళ్లుగా మిత్ర సొసైటీ వారు అందిస్తున్న సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, మిత్ర సోషల్ సర్వీస్ అసోసియేషన్ బాధ్యులు వివేకానంద్, లక్ష్మీనారాయణ, సత్యంసేట్, మాసానిక్రిష్ణ, వెంకాగౌడ్, బీఎం ప్రభాకర్, వెంకటేశం, లక్ష్మణ్, తహేర్‌అలీ పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఎంపీ, ఎమ్మెల్యేలు మొక్కలు నాటారు. అంతకుముందు విద్యార్థులు వారికి ఘనంగా స్వాగతం పలికారు.

ఖేడ్ ఏరియా వైద్యశాలకు కొత్త అంబులెన్స్

నారాయణఖేడ్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ ఏరియా వైద్యశాలకు తన కోటాకు సంబంధించి రూ.40 లక్షలతో అవసరమైన పరికరాలున్న కొత్త ఆంబులెన్స్‌ను సమకూరుస్తానని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ అన్నారు. శనివారం స్థానిక ఏరియా వైద్యశాలలో నిర్వహించిన వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్యుల సమస్యలు పరిష్కరించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే, వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ వైద్యశాలలో మౌలిక సదుపాయాలకు రూ.కోటి మంజూరయ్యాయని తెలిపారు. రక్తనిల్వల కేంద్రం కోసం కూడా ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి, వైద్యశాల సూపరిటెండెంట్ డాక్టర్ రమేష్, అభివృద్ధి కమిటీ సభ్యులు వివేకానంద్, వెంకట్‌రావు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, తాహేర్ అలీ, వినోద్‌పాటిల్, శంకర్‌ముదిరాజ్, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ గృహాలు : ఎమ్మెల్యే



శివ్వంపేటలో ఇందిరమ్మ నిర్మాణానికి పూజ చేస్తున్న ఆవుల రాజిరెడ్డి

నారాయణఖేడ్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ గృహాలను నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని పంచగామలో ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించి, నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. తమ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చి వారి కళ్లల్లో ఆనందం చూడడం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచగామ మాజీ సర్పంచు విఠల్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మాయమాటలతో పదేళ్లు పాలన

శివ్వంపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ మాయమాటలు చెప్పి పదేళ్లు పబ్బం గడుపుకుందని, ఇచ్చిన ఏ ఒక్క హామీ ఆచరణకు నోచుకోలేదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన శివ్వంపేటలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నాయకులతో కలిసి భూమిపూజ చేసి మాట్లాడారు. శివ్వంపేట మండలానికి 422 ఇళ్లు మంజూరయ్యాయని, ఇందులో శివ్వంపేటకు నాలుగు ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇల్లు లేని ప్రతీ నిరుపేదకు విడతలవారీగా సొంతింటి కల సాకారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవీన్‌గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, లక్ష్మం కాంతారావు, మాధవరెడ్డి, కమల, గణేష్, దావూద్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతకు కృషిచేయాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

జహీరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధనకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషిచేయాలని సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం మండలంలోని హుగ్గెల్లిలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అర్థమయ్యే తరహాలో విద్యను బోధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. అలాగే ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మాణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.4 కోట్లతో డిగ్రీ కళాశాల భవనాల విస్తరణ

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



డిగ్రీ కళాశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు అబ్దుల్‌కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.4 కోట్లతో 15 అదనపు తరగతి గదులను నిర్మించి పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విస్తరించామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో గ్లాండ్‌ఫార్మా పరిశ్రమ యాజమాన్యం సౌజన్యంతో నిర్మించిన తరగతి గదులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కేజీ టూ పీజీ ఒకే క్యాంపస్‌లో ఉండేలా పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కాళాశాలను తీర్చిదిద్దామన్నారు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని పరిశ్రమల యాజమాన్యాలు ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి సహకరించాలని కోరారు. తరగతి గదులను ఈ నెల 30న ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

33కేవీ విద్యుత్‌లైన్‌ను రోడ్డు నుంచి వేయాలి : పద్మారెడ్డి



విద్యుత్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న పద్మారెడ్డి

హవేళిఘణపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని స్కూల్‌తండా ఇళ్ల సమీపం నుంచి ఉన్న 33కేవీ విద్యుత్ లైన్‌ను రోడ్డు వైపు నుంచి వేయాలని మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన భారీ గాలివానకు 33కేవీ లైన్ 9 స్తంభాలు కూలిపోయాయి. శనివారం ఆమె తండాను సందర్శించి స్తంభాలు కూలిన ప్రదేశాన్ని పరిశీలించి మాట్లాడారు. తండా ఇళ్లకు లైన్ దగ్గరగా ఉండడంతో ఇళ్లు కట్టుకోలేని పరిస్థితి ఉన్నదన్నారు. ఈ సందర్భంగా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అలాగే జిల్లా విద్యుత్ అధికారి శంకర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఆమె వెంట మాజీ జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సాయిలు, తండా ప్రజలు ఉన్నారు.

హక్కుల సాధన కోసం కురుమలు పోరాడాలి

● సంఘం జిల్లా అధ్యక్షుడు బూరుగడ్డ నగేశ్‌యాదవ్

జోగిపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : హక్కుల సాధన కోసం కురుమలు ఐక్యంగా పోరాడాని సంఘం జిల్లా అధ్యక్షుడు బూరుగడ్డ నగేశ్‌యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన జోగిపేటలో నిర్వహించిన కురుమ సంఘం ఎన్నికల సమావేశంలో మాట్లాడారు. పోరాటం చేయాలంటే మొదటగా తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, అది కేవలం విద్యతోనే సాధ్యమని చెప్పారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గంతో నగేశ్ యాదవ్ సమక్షంలో ఎన్నికల అధికారి ధనుప్రకాశ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఇందులో మున్సిపల్ పరిధిలోని కురుమలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

హత్నూర, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ పోరాటం చేస్తుందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ప్రసాద్ అన్నారు. హత్నూర మండలం దౌల్తాబాద్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏఐటీయూసీ జిల్లా మహాసభల పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆయా రంగాల్లో పని చేస్తున్న కార్మికుల సంక్షేమాన్ని మరిచి, కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తుందని ఆరోపించారు. జూలై 27న టీఎన్జీవో భవన్‌లో నిర్వహించనున్న మహాసభలకు కార్మికులు హాజరై జయప్రదం చేయాలని ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పిల్లి శ్రీకాంత్, మధ్యాహ్న భోజన కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

'జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి'

వెల్దుర్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నర్సాపూర్‌లోని సాయిక్రిష్ణగార్డెన్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్‌మేళా ఉంటుందన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఇంజనీరింగ్ చేసిన వారు సద్వినియోగం చేసుకోవాలని మహేష్‌రెడ్డి కోరారు.

మట్టి అక్రమ రవాణాపై విచారణ

జిన్నారం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : రాళ్లకత్వ శివారు అసైన్డ్ భూముల నుంచి ఎల్ఈడీ పార్కు పారిశ్రామికవాడకు మట్టి అక్రమ రవాణాపై రెవెన్యూ, పోలీసుశాఖ అధికారులు విచారణ నిర్వహించారు. శనివారం 'ఎల్ఈడీ పార్కుకు మట్టి అక్రమ రవాణా' పేరిట ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ దేవదాస్, ఎస్ఐ నాగలక్ష్మి, ఆర్ఐ జయప్రకాష్ రాళ్లకత్వ శివారు 286 సర్వే నెంబరులోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను పరిశీలించారు. అక్రమంగా మట్టిని తరలిస్తే అసైన్డ్ భూములను పీవోటీగా మార్చి, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్, ఎస్ఐలు హెచ్చరించారు.

ముగిసిన సన్న బియ్యం పంపిణీ

● మిగిలిన వారికి రెండురోజులే గడువు

పుల్‌కల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలంలో మూడునెలలకు సంబంధించి ఉచిత రేషన్ బియ్యం పంపిణీ ముగిసింది. మండలంలో 17 చౌకధరల దుకాణాలకుగాను 5,996 రేషన్ కార్డులున్నాయి. ఆయా కార్డుల్లో లబ్ధిదారులుగా ఉన్న వారందరికీ ఒక్కొక్కరికీ ఆరుకిలోల చొప్పున అందజేశారు. ఇందుకు మూడునెలలకు సరిపడా ప్రభుత్వం ఒకేసారి మొత్తం 153 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించింది. దీంతో ఆయా గ్రామాల్లోని చౌకధరల దుకాణ డీలర్లు 94 శాతం మేరకు పంపిణీ పూర్తిచేశారు. ఇంకా ఎవరైనా ఉచిత బియ్యం పొందని వారు మిగిలితే ఈనెల 30వ తేదీలోగా సమీప రేషన్ డీలర్ల వద్ద తీసుకోవాలని చౌక ధరల దుకాణ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ఉప్పరి దేవదాస్ కోరారు. అన్నపూర్ణ, అంత్యోదయ కార్డులు మొదలుకుని అన్నీ రకాల కార్డుదారులకు ఈ బియ్యం ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

ఆర్ఎస్ఎస్ వైఖరి రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం : సీపీఎం

సంగారెడ్డి రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఎస్ఎస్ వైఖరి రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శనివారం నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. భారతదేశాన్ని రాజ్యాంగకర్తలు ఆధునిక ప్రజాస్వామ్య లౌకిక దేశంగా ఉంటూ ప్రపంచంలో పేరు ప్రఖ్యాతలు గడించాలని కోరుకుంటున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, జీ.సాయిలు, మాణిక్యం, రాంచందర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

● ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నరోత్తం

జహీరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నరోత్తం పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో పెద్ద మొత్తంలో పరిశ్రమలున్నా స్థానిక నిరుద్యోగులకు అవకాశం కల్పించకపోవడంతో యువత ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరిశ్రమల ఏర్పాటు సమయాల్లో స్థానికులకే 80 శాతం ఉద్యోగాలు కల్పిస్తామంటూ ప్రగల్భాలు పలికి 20శాతం సైతం ఉద్యోగాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. సాధ్యమైనంత వరకు స్థానికులకు అవకాశం కల్పిస్తేనే ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, నర్సింలు, గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఎన్ఆర్‌ను సందర్శించిన కంటర్లాండ్స్ అసోసియేట్ ప్రోవోస్ట్



ఎంఎన్ఆర్ యూనివర్సిటీ యాజమాన్యంతో ఎంవోయూ మార్చుకుంటున్న కంటర్లాండ్స్ అసోసియేట్ ప్రోవోస్ట్

సంగారెడ్డి రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఆమెరికా (యూఎస్ఏ)లోని కంటర్లాండ్స్ అసోసియేట్ ప్రోవోస్ట్ డాక్టర్ మార్క్, హన్నాలు సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామ శివారలోని ఎంఎన్ఆర్ యూనివర్సిటీని శనివారం సందర్శించారు. హైదరబాద్‌కు చెందిన ఎంఎన్ఆర్ విశ్వవిద్యాలయం, యూఎస్ఏలోని కంటర్లాండ్ విశ్వవిద్యాలయం విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యనందించేందుకు పరస్పరం ఎంవోయూ మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్ఆర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డా.కృష్ణ చలం, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీ డీన్ డా.కిరణ్, స్కూల్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సైన్సెస్ డీన్ డా.వెంకటరమణ, స్కూల్ ఆఫ్ ఫిజియోథెరపీ డీన్, డా.హరీష్‌కుమార్, ఎస్‌వోఈటీ అసోసియేట్ ప్రొఫెసర్లు డా.జస్వంత్, డా.పిసి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

కబ్జా చెరలో నల్లచెరువు

5వ పేజీ తరువాయి

సాగు చేస్తున్నారని, చెరువు నిండకపోవడంతో వ్యవసాయం మూలన పడిందని వాపోతున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో గతంలో ఆర్వో ప్లాంటును అధికారులు మూసేశారు. కొన్నాళ్ల స్తబ్దుగా ఉన్న ప్లాంటు నిర్వాహకులు ఇటీవల రాత్రి వేళల్లో తెరిచి ప్లాంటులో వాటర్ బాటిళ్లను తయారు చేస్తున్నారని సమాచారం. అంతేకాకుండా ఈ ప్లాంట్‌లో బాలకార్మికులతో పనులు చేయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బాలలను పనుల్లో పెట్టుకుంటే జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశమున్నా అధికారులు తనిఖీలు చేయకపోవడంతో యథేచ్ఛగా పనిచేయించుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, రైతులు కోరుతున్నారు.

మంత్రులను కలిసిన నాయకులు



వివేక్‌తో కాంగ్రెస్ నాయకులు

గుమ్మడిదల/పటాన్‌చెరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన వివేక్‌ను కాంగ్రెస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ గుమ్మడిదల మండల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఆయనను సత్కరించి, ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయనను కలిసినవారిలో ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు షట్ట నర్సింగరావు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖామంత్రి దామోదర్ రాజనర్సింహను కలిశారు.

రోడ్డు పక్కన పొదల తొలగింపు

నారాయణఖేడ్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా శనివారం పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. నెహ్రూనగర్‌లో రోడ్డు పక్కన దట్టమైన పొదలు పెరిగి వాటి కొమ్మలు రోడ్డుపై ఒరగడంతో వాహన దారులు, పాదచారులు, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున ఆయా పొదలను నరికివేశారు. నెహ్రూనగర్ కాలనీతో పాటు హైదరాబాద్ రోడ్డు పక్కన గల మురుగు కాలువల్లోని చెత్తను తొలగించారు. ఆయా పనులను కమిషనర్ జగ్జీవన్, శానిటేషన్ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

విద్యుత్ ఉప కేంద్ర ఆపరేటర్‌పై సస్పెన్షన్ వేటు

కంగ్టి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పంచమహల్ దామర్‌గిద్దలోని 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో ఆపరేటర్‌గా పనిచేస్తున్న మాదయ్య స్వామిపై సస్పెన్షన్ వేటు పడినట్లు ఏఈ శోభారాణి శనివారం తెలిపారు. ఆపరేటర్ మాదయ్య స్వామి మద్యం సేవించి విధులకు హాజరవుతున్నట్లు ఉప కేంద్రం పరిధిలోని గ్రామాల ప్రజలు పలువురు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో ఆపరేటర్‌ను సరేండర్ చేస్తూ సిఫారసు చేయగా ఉన్నతాధికారులు ఆపరేటర్ మాదయ్య స్వామిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారని ఏఈ శోభారాణి తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై ఎంపీవోకు ఫిర్యాదు

చిన్నశంకరంపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని చందంపేట గ్రామపంచాయతీ కార్యదర్శి పద్మపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు శనివారం ఎంపీవో గిరిజారాణికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ, సమయ పాలన పాటించడం లేదన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై కార్యదర్శి దృష్టికి తీసుకొస్తే పట్టించుకోవడం లేదన్నారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎంపీవోకు విన్నవించారు. చర్యలు తీసుకోకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలి : ఎంపీడీవో

చిన్నశంకరంపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలాభివృద్ధికి సంబంధిత శాఖల అధికారులు కృషిచేయాలని ఎంపీడీవో దామోదర్ అన్నారు. శనివారం చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో శాశ్వత అభివృద్ధి ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లు బాధ్యతారాహిత్యంగా పని చేయాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి ప్రణాళికపై పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, ఎంపీవో గిరిజారాణి, ఏపీవో రాజ్‌కుమార్, ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.


పుణ్యక్షేత్రాలను దర్శించుకున్న భక్తులు

నారాయణఖేడ్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఒక ఎక్స్‌ప్రెస్, ఒక సూపర్ డీలక్స్ బస్సుల్లో శుక్రవారం బయలుదేరి వెళ్లిన ఖేడ్ ప్రాంత భక్తులు శుక్రవారంతో పాటు శనివారం 10 పుణ్య క్షేత్రాలైన వేముల వాడరాజేశ్వరస్వామి, కొండగట్టు ఆంజనేస్వామి, ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, కాళేశ్వరంలోని ముక్తేశ్వర ఆలయాలతో పాటు రామగుండం మిడ్ మానేరుడ్యాం, వరంగల్, సిద్దిపేట, మెదక్, ఏడుపాయలలోని వివిధ ఆలయాలను దర్శించుకొని శనివారం సాయంత్రం ఖేడ్‌కు చేరుకున్నారు. తక్కువ చార్జీతో ఆలయాలను దర్శించుకునేలా బస్సులు ఏర్పాటు చేసినందుకు భక్తులు స్థానిక డీఎం మల్లేశయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

'లాభసాటి వ్యవసాయంపై దృష్టిపెట్టాలి'

జహీరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న కాలానుగుణంగా రైతులు లాభసాటి వ్యవసాయం చేస్తేనే ప్రయోజకులవుతారని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలు సాయిప్రియాంక, స్వామి అన్నారు. శనివారం మండలంలోని హుగ్గెలి గ్రామంలో మల్లారెడ్డి విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు గ్రామీణ అంచనా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విద్యార్థులు గ్రామానికి సంబంధించి మ్యాప్(గ్రామీణ అంచనా) వేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. అలాగే రైతులకు మట్టి నమూనా పరీక్షలకు సంబంధించి పరీక్షా ఫలితాల పత్రాలను అందజేశారు.

మున్సిపల్ కమిషనర్‌గా రవీందర్



రవీందర్

జోగిపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : అందోలు-జోగిపేట కమిషనర్‌గా ఏ.రవీందర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గజ్వేల్-ప్రజాపూర్ మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ, జీహెచ్ఎంసీలో ఎగ్జిక్యూటివ్ ఎస్టేట్ అధికారిగా డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్న రవీందర్ ప్రమోషన్‌పై కమిషనర్‌గా ఇక్కడికి వచ్చారు. శనివారం ఆయన కార్యాలయానికి రాగా సిబ్బంది స్వాగతం పలికారు. ఇక్కడ రెండున్నరేళ్లుగా పనిచేసిన తిరుపతి పదోన్నతిపై సీడీఎంఏ కార్యాలయానికి బదిలీ అయ్యారు. బుధవారం అందోలు-జోగిపేట కమిషనర్‌గా గురులింగం బాధ్యతలు తీసుకుని, శుక్రవారం రాత్రి.. కర్నూలు జిల్లా నందికొట్కూరు కమిషనర్‌గా బదిలీ అవడం విశేషం.

కురుమ సంఘం కార్యవర్గం ఎన్నిక

పటాన్‌చెరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు కురుమ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం జిల్లా నాయకుల సమక్షంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మారగారి శంకరయ్య, ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా మామిడిపల్లి రవి, సహాయ కార్యదర్శిగా ఈశ్వర్, కోశాధికారిగా రాములు, సలహాదారుడిగా పోచారం కిష్టయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనికి అనుబంధంగా యువత కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా నాయకుడు నగేష్‌కురుమ, అందోల్ మున్సిపల్ మాజీ చైర్మన్ గూడెం మల్లయ్యకురుమ, సీనియర్ నాయకులు అంబారిఈశ్వరయ్య పాల్గొన్నారు.